కవ్వాల్‌ను సందర్శించిన జూనియర్ సివిల్ జడ్జి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ఇంధన్‌పల్లి అటవీ రేంజ్‌ను ఆదిలాబాద్ జూనియర్ సివిల్‌జడ్జి ప్రమీలా జైన్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. సందర్శనకు వచ్చిన జడ్జికి ఎఫ్ఆర్‌ఓ కారం శ్రీనివాస్, అటవీ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం వారు జంగల్ సఫారీ వాహనాలలో మైసమ్మ, గనిశెట్టి కుంటలను సందర్శించారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యల గురించి ఎఫ్ఆర్‌ఓ వారికి వివరించారు. ఎఫ్ఎస్ఓ హనుమంతరావు, ఇతర అటవీ అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

నమ్మిక తెలుగు దినపత్రిక

1

ఆదిలాబాద్

సోమవారం | మార్చి 24, 2025 | www.navatelangana.com

రంజాన్‌తోఫా అందించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మంచిర్యాల



ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు రంజాన్ పండగను పురస్కరించుకుని పట్టణంలోని ముస్లింలకు ఆదివారం రంజాన్‌తోఫా అందించారు. ఆదివారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రంజాన్‌తోఫా అందించి ముస్లిం సోదర సోదరి మణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎన్నికలతో సంబంధం లేకుండా ఎల్లపుడు సేవ చేస్తూ ఉంటానన్నారు. కొక్కిరాల రఘుపతి రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవలు అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందులో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, నాయకులు పాల్గొన్నారు.

నోర్లు తెరిచిన బోర్లు..!

- పది మీటర్ల అడుగులోకి భూగర్భజలాలు
- పూర్తిస్థాయిలో రబీ పంటలకు అందని నీరు
- గత్యంతరం లేక మధ్యలో వదిలేస్తున్న అన్నదాతలు
- గతంలో ఎన్నడూ లేని విధంగా దుర్భిక్ష పరిస్థితులు
- కరువు జిల్లాగా ప్రకటించాలని వామపక్షాల డిమాండ్

ఉమ్మడి జిల్లాలో వేసవి ఆరంభం కాగానే తాగునీటి కటకట నెలకొంటోంది. కానీ ఈ ఏడాది తాగునీటితో పాటు సాగునీటికి కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కొన్నేండ్లలో కనిపించని విధంగా భూగర్భజలాలు అడుగంటిపోవడం.. మరింత లోతులకు వెళ్లిపోవడంతో పంట చేన్లలో బోర్లు నోర్లు తెరిచాయి. ప్రతి ఏటా రబీలో వినియోగమయ్యే బోర్లు.. ఈ ఏడాది నోర్లు తెరవడంతో రైతుల కంట కన్నీరును మిగిల్చాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో తాగు, సాగునీటికి దుర్భిక్ష పరిస్థితులు తలెత్తడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఏడాది వర్షపాతం సైతం తక్కువగానే నమోదు కావడం ఈ పరిస్థితికి కారణమని అధికారులు చెబుతుండగా.. ప్రభుత్వం కరువు జిల్లాగా ప్రకటించాలని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.



నీరుఅందలేక ఎండిపోతున్న జొన్న పంట

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తాగు, సాగు నీటి తాపం తీవ్రంగా మారింది. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో సమస్య తీవ్రరూపం దాల్చింది. అనేక గ్రామాల్లో నీటి వనరులు పనిచేయడం లేదు. మిషన్ భగీరథ సక్రమంగా పంపిణీ కావడం లేదు. పంట పొలాల్లో బోర్ల నుంచి చుక్కనీరు రాకపోవడంతో పంటలకు నీరందించలేని పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం 10మీటర్ల లోతులకు నీళ్లు వెళ్లిపోయాయని భూగర్భజలశాఖ అధికారులు చెబుతున్నారు. కిందటేడాది ఇదే నెలలో 8మీటర్ల లోతులో ఉండగా.. ఈ ఏడాది 2 మీటర్లు మరింత కిందకు వెళ్లిపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తుతోంది. ముఖ్యంగా కిందటేడాది 1100మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా ఈ ఏడాది 900మిల్లీ మీటర్లు కురిసింది. ఉమ్మడి జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైనా ఒకేసారి అధిక మొత్తంలో కురవడంతో నీరంతా అప్పుడే భూగర్భంలోకి వెళ్లిపోయింది. ఒకే మాదిరిగా కొన్ని రోజుల వరకు వర్షపాతం ఏకధాటిగా కురిస్తే భూగర్భజలాలు పెరిగేందుకు ఆస్కారం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కానీ ఈ ఏడాది అలా జరగకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు కనిపిస్తున్నట్లు పేర్కొంటున్నారు.



సిరికొండ మండలం దోబిగూడ పంచాయతీ పరిధిలోని సోన్‌పల్లి గ్రామానికి చెందిన సిడాం ముకుంద్‌రావు తనకున్న నాలుగున్నర ఎకరాల్లో రబీ పంటలు సాగు చేస్తున్నారు. నువ్వులు, పెసరి పంటను సాగు చేయగా.. పంట చేనులోని బోరు అర్థాంతరంగా అడుగంటిపోయింది. దీంతో పంటకు పూర్తిస్థాయిలో నీళ్లు ఇవ్వలేక మధ్యలోనే వదిలేశారు.

పంటలను వదిలేస్తున్నారు..!

ఉమ్మడి జిల్లాలో అనేక మంది అన్నదాతలు రబీ పంటలపై ఆశలు పెట్టుకుంటారు. ఈ సీజన్‌లో వచ్చిన పంట లాభంతో రానున్న ఖరీఫ్ పంటలకు పెట్టుబడికి వెచ్చిస్తుంటారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1.20లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఎక్కువగా మొక్కజొన్న, వరి, మిర్చి, జొన్న, పెసరి, నువ్వులు తదితర పంటలు వేశారు. తాజాగా భూగర్భంలో నీళ్లు అడుగంటిపోవడంతో బోర్లు పనిచేయని పరిస్థితి కనిపిస్తోంది. ఒక్కో రైతు ఐదు నుంచి పది ఎకరాల్లో పంటలు సాగు చేస్తే.. నీరు సరిపోకపోవడంతో కొంత మేర పంటకు నీళ్లిస్తూ మిగితా పంటను పశువులకు వదిలేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా బోర్లపై ఆధారపడి పంటలు పండించే వారు అధికంగా ఉండగా.. మరికొందరు రైతులు జలాశయాల కాల్వల ద్వారా నీటిని పొందుతున్నారు. కానీ గతంలో ఎన్నడూ లేని విధంగా నీటి సమస్య ఏర్పడటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు తాగునీటి కోసం ట్యాంకర్ల ద్వారా అక్కడక్కడ పంపిణీ చేస్తున్నా.. పంటలకు మాత్రం ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. మార్చిలోనే ఈ పరిస్థితులు తలెత్తితే రాబోవు రోజుల్లో పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తమవుతోంది.



జైనథ్ మండలం ఆకుర్ల గ్రామానికి చెందిన వైద్య ఉమేష్‌కు ఐదు ఎకరాల పొలం ఉండగా.. రబీలో రెండు ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. పంట ఏపుగా పెరిగి దిగుబడి వచ్చే సమయంలో బోరులో నీళ్లు ఎండిపోవడంతో పంటకు నీరందించలేని పరిస్థితి తలెత్తింది. దీంతో పంటను కాపాడుకోలేక అర్థాంతరంగా వదిలేయాల్సి వచ్చిందని వాపోతున్నారు. ఈ పరిస్థితి ఒకరిద్దరు రైతులది మాత్రమే కాదు. ఉమ్మడి జిల్లాలో అనేక మంది ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారు.

కరవు జిల్లాగా ప్రకటించాలి

దర్శనాల మల్లేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి.



జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా తాగు, సాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో పంటలకు సరిపడా నీరందించలేని పరిస్థితి ఉంది. ఈ ఏడాది వర్షపాతం సైతం సరైన రీతిలో లేకపోవడంతో రబీ పంటలు సాగుచేయలేని పరిస్థితి. దీంతో ప్రభుత్వం వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలి.

మాలీల ఎస్టీ హోదా కోసం మేధావులు ముందుకు రావాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

25 ఏండ్లుగా మాలీలకు సామాజిక న్యాయం ఎస్టీ హోదాకై అనేక పోరాటాలు చేశారని, ఉద్యమం చివరి దశలో చేరుకున్నందున మాలీ ఉద్యోగస్తులు, మేధావులు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో గల పూలే గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన మాలీ ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే దంపతుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని, కన్నతల్లి లాంటి కులం రుణం తీర్చుకోవాలని అన్నారు. నూతనంగా జూనియర్ లెక్చరర్లుగా ఎంపికైన బెల్లపు నగేష్ తాంసి, గురునులే దత్త సొంకాస్, టీచర్లుగా ఎంపికైన సాయికుమార్ ప్రధాన్ గిరిగాం, రాగి సంజీవ్ కుచ్లాపూర్ విజయ్ మాహుర్లే జైనథ్‌లను సంఘ సభ్యులు శాలువా, మేమెంటో, ప్రశంస పత్రము, మెడల్‌తో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాలీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ అంబేకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ గురునులే, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మురళీధర్ నాగోషే, జిల్లా అధ్యక్షులు విజయ్ వాడగూరే సంఘ సభ్యులు దారట్ల శ్రీనివాస్, దీపక్ మోహుర్లే, మహిళా సంఘ సభ్యులు కల్పన పెట్కులే, శాలిని ప్రధాన్, గంగుతాయి సెండే, బెల్లపు తానుబాయి పాల్గొన్నారు.

ఒకే దేశం ఒకే ఎన్నికపై కార్యశాల నిర్వహణ

నవతెలంగాణ-ఉట్నూర్

ఒకే దేశం ఒకే ఎన్నికపై ఆదివారం మండల బీజేపీ ఆధ్వర్యంలో కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రితీష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జమిలి ఎన్నికల నేపథ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల నిరంతర నిర్వహణతో అధికారులకు సమయం వృధా అవుతుందని, ఖర్చులు అధికమవుతాయన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నికతో కేంద్ర ప్రభుత్వానికి ఖర్చు భారం తగ్గుతుందన్నారు. జమిలి ఎన్నికలతో భారత్ ప్రపంచ దేశాలకు ధీటుగా అభివద్ధి చెందే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ కన్వీనర్ అమర్‌నాథ్, కో కన్వీనర్ అర్జున్, మాజీ ఎంపీపీ ధన్‌లాల్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ దావుల బాలాజీ, మాజీ ఎంపీటీసీలు కందుకూరి రమేష్, రవీందర్, భాగిర్త, జిల్లా ఓబీసీ కార్యదర్శి తన్నీరు సతీశ్, జిల్లా నాయకులు రాథోడ్ శేషారావు, పవర్ దేవిదాస్, సీనియర్ నాయకులు ఎండపల్లి అంజన్న, మండల ప్రధాన కార్యదర్శి బింగి వెంకటేష్, కాల్వ రవి, కిషన్ పటేల్, గాలి శ్రీకాంత్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో శాస్త్ర విద్యా విధానంకై పోరాడుదాం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశంలో శాస్త్ర విద్యా విధానంకై పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్ అన్నారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టీఎన్‌జీఓ భవనంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ దేశ విముక్తి కోసం, సామ్రాజ్యవాద వ్యతిరేక విధానాన్ని సవాల్ చేసి మృత్యువును ముద్దాడిన విప్లవకారులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ అని కొనియాడారు. ఎంచుకున్న లక్ష్యం కోసం వారు చూపిన తెగువ, త్యాగం, ధైర్యం విద్యార్థులు, యువజనులు, ప్రజలందరి హదయాలలో చెరగని ముద్ర వేసుకుందన్నారు. పాఠ్యపుస్తకాలలో స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయుల చరిత్రను తీసివేస్తూ ఈ దేశ స్వాతంత్ర ఉద్యమానికి సంబంధం లేని వారి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్పించే కుట్ర జరుగుతోందన్నారు. కావున ఈ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరడం జరుగుతోందన్నారు. ఇందులో ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ శేఖర్, కార్తీక్ సంతోష్ పాల్గొన్నారు.

ఓటేయడానికి వేములవాడ పయనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓం శివమహేశ్వర మాల జంగం రాష్ట్ర సంఘం కార్యవర్గం కాలపరిమితి ముగియడంతో నూతన కార్యవర్గం ఎన్నిక కోసం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. కాగా అధ్యక్ష, కార్యదర్శి పదవుల కోసం పలువురు పోటాపోటీగా నామినేషన్ వేశారు. ఈ రాష్ట్ర ఎన్నికలు ఆదివారం వేములవాడలో నిర్వహించగా బ్యాలెట్ ప్రక్రియ ద్వారా సజావుగా సాగింది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ నుంచి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాజరి వినోద్, దేవల్ల శంకరయ్యతో పాటు 16 మంది సభ్యులు ఓటేయడానికి ప్రత్యేక వాహనంలో వేములవాడకు పయనమయ్యారు. అనంతరం అక్కడ ఆధార్‌కార్డుతో లైన్‌లో నిల్చొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో సంఘం కోశాధికారి గాజరి సంతోష్, సభ్యులు దేవళ్ల రాజమల్లు, మాదం మల్లయ్య, దేవుళ్ల మల్లికార్జున్, గణపురం అశోక్, మాటూరి లస్మయ్య, మేకల శివకుమార్, ఆరే రాజలింగం, అలుగురు జ్ఞానేశ్వర్, దేవళ్ళ వెంకటేష్, గాజరి గంగాధర్, మాదం గంగాధర్, మద్దెల సుదర్శన్, ప్రభుస్వామి, సన్నదాన్, గంగయ్య పాల్గొన్నారు.

వసతి గృహాల ఏఎన్‌ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు వసతి గృహాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏఎన్ఎంల జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బడ్జెట్ వచ్చినా వేతనాలు పూర్తిస్థాయిలో చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేతనాల్లో కోతలు విధిస్తున్న సదరు కాంట్రాక్టర్ పై కలెక్టర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎంలు పాఠశాలలు, వసతిగహాల్లో స్థానికంగా ఉండి ఆదివాసీ గిరిజన విద్యార్థులకు 24 గంటలపాటు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారని, కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారని అన్నారు. ఏఎంఎంలకు ఎలాంటి అత్యవసరం వచ్చిన ఒక రోజు కూడా సెలవు ఇవ్వకుండా, వేతనాల్లో కోతలు విధిస్తున్నారని కనీసం వీరికి ఉండడానికి వసతి సౌకర్యాలు కూడా లేవని వాపోయారు. పీఎఫ్ కటింగ్ చేస్తున్నామని చెపుతున్నారు కాని కటింగ్ విషయంలో పూర్తి సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి పూర్తి వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ ఇన్సూరెన్సు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గుర్తింపు కార్డులను ఇవ్వాలని, హెచ్ఎం, వార్డెన్‌ల వేధింపులను అరికట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఏఎన్ఎం యూనియన్ అధ్యక్షురాలు కే.కమల, కోశాధికారి శ్యామ్ సుందర్, ఉపాధ్యక్షులు నర్మద, కామేశ్వరి, సహాయ కార్యదర్శులు జంగుబాయి, అశ్విని, అనిత, విజయ్, నర్మద పాల్గొన్నారు.

నటుడు సాయి కుమార్‌కు కుమురంభీం జాతీయ అవార్డు

- జిల్లా కేంద్రంలో ప్రదానోత్సవం
- సందడి చేసిన సినీ ప్రముఖులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారత్ కల్చరల్ అకాడమీ-హైదరాబాద్, ఆదివాసి సాంస్కృతిక పరిషత్ కుమురంభీం ఆసిఫాబాద్, ఓం సాయి తేజ ఆర్ట్స్, నవజ్యోతి సాంస్కృతిక సంస్థ సంయుక్తంగా ఏటా వివిధ రంగాలలో కషి చేస్తున్న వారికి అవార్డు అందిస్తున్నారు. ఇందులో భాగంగా 2024 సంవత్సరానికి కుమ్రంభీం జాతీయ అవార్డుకు నటుడు సాయికుమార్ ఎంపిక కాగా జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో ఆదివారం అవార్డు ప్రదానోత్సవం నిర్వహించారు. అవార్డు ప్రదానోత్సవానికి నిర్వహణ కమిటీ చైర్మన్ మాజీ ఐఏఎస్ పార్థసారధి, విశిష్ట అతిథులుగా ఎంపీ నగేష్, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి, జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, మాజీ మంత్రి బాబు మోహన్, హాస్యనటుడు శివారెడ్డి, కొమురం భీం మనవడు సోనేరావు, నిర్వహణ కమిటీ కో చైర్మన్ సురేష్ కుమార్, కన్వీనర్ అర్జు మాస్టర్, యువ నిర్మాత నక్క రాహుల్ యాదవ్ హాజరై సాయికుమార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి మెమొంటోతో పాటు, రూ.50 వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ చైర్మన్ పార్థసారధి మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకమైనదన్నారు. గతంలో జిల్లాలో పనిచేయడం మర్చిపోలేని అనుభవమని అన్నారు. గత 12 ఏండ్లుగా వివిధ రంగాల్లో కషి చేసిన వారికి అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. 2024కి సాయికుమార్‌కు అవార్డు అందజేసినట్లు పేర్కొన్నారు. అవార్డు గ్రహీత సాయికుమార్ మాట్లాడుతూ తన సినీ జీవితంలో అనేక అవార్డులు రికార్డులు సొంతం చేసుకున్నానని అయితే ఆదివాసీ పోరాటయోధుడి పేరుమీద పెట్టిన కుంరం భీమ్ జాతీయ అవార్డు రావడం ఎన్నటికీ మర్చిపోలేనిదన్నారు. ఆదివాసీల ఆత్మగౌరవానికి భీమ్ ప్రతిక లాంటివాడని అటువంటి అవార్డు అందుకోవడం సంతోషాన్నిచ్చిందన్నారు. ఎంపీ నగేష్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక అభివృద్ధికి కషి చేస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే కోవలక్ష్మీ మాట్లాడుతూ ఇంత పెద్ద అవార్డును జిల్లా కేంద్రంలో అందించడం జిల్లా ప్రజలతో పాటు ఆదివాసీలకు కూడా మంచి గౌరవం ఇచ్చినట్లయ్యిందన్నారు. హీరోలను సినిమాలలో చూడడమే కానీ మొట్టమొదటిసారి నేరుగా చూడడం జిల్లా ప్రజలకు మర్చిపోలేనిదన్నారు. మాజీ మంత్రి బాబు మోహన్, కళాకారుడు శివరెడ్డిలు మాట్లాడుతూ అవార్డులు కళాకారులకు ఎంతగానో ప్రోత్సాహాన్నిస్తాయన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని అంకమరాజు గుడి వద్ద సాయికుమార్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివాసి సంస్కృతి సంప్రదాయాల మధ్య ఊరేగింపుగా వెళ్లి కొమరం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అనంతరం గార్డెన్‌కు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, కమిటీ సభ్యులు ధర్మపురి వెంకటేశ్వర్లు, సాయిని రాజశేఖర్, రాధాకష్ణ చారి, ముప్ప శేఖర్ పాల్గొన్నారు.





బంగారం వాడకాన్ని నిషేధించండి



నవతెలంగాణ-ఉట్నూర్

బంగారం వాడకాన్ని నిషేధించాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్ చౌహన్ అన్నారు. మండలంలోని సేవదాస్‌నగర్ జగదాంబదేవి ఆలయంలో ఆదివారం బంజారా ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారం వల్ల ధనిక, పేద వర్గాలుగా కుటుంబం, సమాజం విడిపోతోందని ఆందోళన చేశారు. ఆడపడుచులు మూడు తులాలు, మగవాళ్లు ఒక తులం బంగారాన్ని మాత్రమే ధరించాలని, బంజారా సంస్కృతి సాంప్రదాయం ప్రకారమే వెండి ఆభరణాలను ఎక్కువగా ఉపయోగించుకోవాలన్నారు. అతిత్వరలో జిల్లాలోని అన్ని తండాల నాయక్, కార్బరి, డావ్, గేరియా, మహారాజ్, జిల్కరిలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఇందులో బంజారా భజన్ మండలి మహారాజ్ ఆడే దిగంబర్, రాథోడ్ పరశురాం, రాథోడ్ దశరథ్ మహారాజ్, ఆడే సుభాష్ నాయక్, పవార్ పరుశురాం, గులాబ్ మహారాజ్, సునీల్ రాథోడ్, జాదవ్ ఆనంద్‌రావు, శివలాల్‌నాయక్, లింబ మహారాజ్, మోహన్ మహారాజ్, రాథోడ్ చంద్రకాంత్, జాదవ్ పరశురాం, ఆడే వసంతరావు, జాదవ్ తిరుపతి, జ్ఞానేశ్వర్, పవార్ గంగారాం నాయక్, జాదవ్ మధుకర్, జాదవ్ కపిల్, ఆడే సురేష్ పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్



నవతెలంగాణ-పెంబి

ప్రపంచ అటవీ దినోత్సవ వేడుకల్లో భాగంగా మండల ఫారెస్ట రేంజ్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సమీపంలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. మారుమూల గిరిజన గ్రామాల నుంచి ప్రజలు వచ్చి రక్త పరీక్షలు చేసుకొని, మందులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ రమేష్ రావు మాట్లాడుతూ ఆరోగ్యం కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ లక్ష్యంగా ఉండాలని అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలని అందులో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటలన్నారు. ఇందులో లలిత మల్టీస్పెషల్ హాస్పిటల్ వైద్యులు మహేష్ బాబు, శ్వేత, హరికష్ణ, సురేష్, ఫారెస్ట్ అధికారులు డీవైఆర్ఓ ప్రతాప్ నాయక్, ఎఫ్ఎస్ఓ సుధాకర్, ఎఫ్‌బీఓలు స్రవంతి, శ్రీనివాస్, కిరణ్, గంగారాం, ఆశిష్, నరేష్ పాల్గొన్నారు.

నేడు వారసంతకు వేలం పాట

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే వారసంతకు వేలం పాటను సోమవారం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు ఉదయం 10 గంటలకు, రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవిని భర్తీ చేయాలి

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవిని వెంటనే భర్తీ చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెన్నెల సతీష్, మండలాధ్యక్షుడు రాథోడ్ జైరాం, మైనార్టీ సెల్ అధ్యక్షులు జావీద్‌ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవిని భర్తీ చేయకుండా ఉండటంతో ఇక్కడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పార్టీకి గత కొన్ని సంవత్సరాలనుంచి కష్టపడి పని చేసిన వారికి మాత్రమే మార్కెట్ పదవిని ఇవ్వాలని అన్నారు. అదే విదంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, దిష్టిబొమ్మలను దహనం చేసిన వారికి ఈ పదవి ఇవ్వకుండా పార్టీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్దీ రోజుల్లోనే అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు సూర్యవంశీ విలాస్ ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంతో పాటు పొన్నారి, గిరిగామ గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం ఆయా గ్రామంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కొబ్బరి కాయలు కొట్టి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. మండల కేంద్రంలో దాదాపు ముప్పై లక్షల నిధులతో కాంగ్రెస్ నాయకులు పనులు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు శ్రీధర్‌రెడ్డి, కృష్ణ, సంతోష్, నారాయణ, మహేందర్, రామన్న యాదవ్, రఘు, రమణ, నరేష్, శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, అశోక్, అరుణ్ ఉన్నారు.



ఇప్ప పువ్వు సీజన్ షురూ..



ఇప్ప పువ్వు సేకరిస్తున్న ఆదివాసులు

- జీసీసీ ద్వారా కొనుగోలు చేయని వైనం
- దళారుల రంగ ప్రవేశం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

జిల్లా పేరు వినగానే గుర్తుకొచ్చేది అడవులు అక్కడ నివసించేది ఆదివాసులు. గల గల పారే సెలయేర్లు.. పచ్చని చెట్లు. కుహు.. కుహు.. మనే కోకిల గానాలు.. అందులో పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తారు. గోండు ఆదివాసులు అడవి తల్లిని నమ్ముకొని అటవీ సంపదపై కుటుంబ పోషణ చేసే ఆదివాసులు. ప్రతి ఏటా మార్చి నెలలో మండుటెండలో అడవిలో దొరికే ఇప్ప పువ్వు సేకరణకు వెళ్తుంటారు. ఈ ఏడు ఇప్పపువ్వు సీజన్ కాస్త బాగానే ఉందని, ఆయా గ్రామాల ఆదివాసులు పేర్కొంటున్నారు. తెల్లారక ముందే వేకువ జామున ఆదివాసుల తన కుటుంబ సభ్యులతో ఇప్పపువ్వు సేకరణకు గ్రామ పొలిమేర వద్దకు, అడవిలోకి వెళ్తుంటారు. ఇలా 20రోజుల నుంచి 30 రోజుల వరకు ఈ ఇప్పపువ్వు సీజన్ కొనసాగుతుంది. ఇలా ప్రతి రోజు సేకరించిన ఇప్పపువ్వుకు తమ ఇంటివద్ద ఎండ బెటుతారు. ఈ సీజన్‌లో కనీసం ఐదు నుంచి ఆరు క్వింటాళ్ల వరకు ఇప్పపువ్వును జమా చేసుకుంటారు. ఈ పువ్వులను అంగడి వారాంతపు సంతలో అమ్మి తమ కుటుంబానికి అవసరమగు నిత్యావసర వస్తువులను తెచ్చుకుంటారు.

కొనుగోలు చేయని జీసీసీ..


గతంలో ఆదివాసులు అడవికి వెళ్లి సేకరించిన బంక, ఇప్పపువ్వు తేనె వంటి అటవీ సంపదను ఐటీడీఏ పరిధిలోని జీసీసీ ద్వారా కొనుగోలు చేసేది. దీనితో ఆదివాసులకు గిట్టుబాటు ధర దొరికేది. ప్రస్తుతం జీసీసీ సంస్థపై వస్తువులను కొనుగోలు చేయడం లేదు. దీంతో ఆదివాసుల నుంచి దళారులు తక్కువ ధరకు అమ్మి అక్రమ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఆదివాసులు ఆర్థికంగా నష్టపోయి వారి శ్రమను దోచుకుంటున్నారు. ఇప్పటికైన ఐటీడీఏ ఉన్నతాధికారులు జీసీసీ ద్వారా ఇప్ప పువ్వుతో పాటు వివిధ అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఆయా గ్రామాల ఆదివాసులు పేర్కొంటున్నారు.

జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలి



ప్రభుత్వం ఆదివాసులు సేకరించిన ఇప్ప పువ్వుతో పాటు వివిధ ఉత్పత్తులను జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలి. దీంతో తమకు గిట్టుబాటు ధర కలుగుతోందన్నారు. ప్రస్తుతం వివిధ దుకాణాలు, దళారులు రంగా ప్రవేశం చేసి తక్కువ ధరకు కొనుగోలు చేసే అవకాశముందన్నారు.

గేడాం జనార్ధన్, కేస్లాపూర్



నిరంతరం విద్యుత్ సౌకర్యం కల్పించాలి

- విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సొనారి గ్రామస్తుల ధర్నా



నవతెలంగాణ-కుభీర్

గ్రామానికి నిరంతరంగా విద్యుత్ సౌకర్యం అందించి 24గంటల పాటు సరఫరా చేసేలా చూడాలని సొనారి గ్రామానికి చెందిన గ్రామస్తులు ఆదివారం సొనారి సబ్ స్టేషన్ ముందర ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. గత 10సంవత్సరాల కాలంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి గ్రామానికి 24గంటల పాటు నిరంతరంగా విద్యుత్ సౌకర్యం అందించేవారు. గత మూడు నెలలుగా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్షంగా సొనారి గ్రామానికి ఉన్న సింగిల్ పేస్ లైన్‌ను తొలగించి నిగ్వ గ్రామానికి పీడర్‌కు కలుపడంతో త్రీ పేస్ లైన్ మాత్రమే సరఫరా అవుతుందని ఆరోపించారు. దీంతో తమ గ్రామానికి సింగిల్ పేస్ లైన్ నిరంతరంగా సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ స్టేషన్ ఉన్న గ్రామానికి 24గంటల పాటు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలని, నిబంధనను తుంగలో తొక్కి ఇలా చేయడం విద్యుత్ శాఖ అధికారులు సరికారని పేర్కొన్నారు. తమ గ్రామానికి 24గంటలు విద్యుత్ సదుపాయం కల్పించాలని లేని యెడల సబ్‌స్టేషన్ ఎదుట నిరహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఈ విషయం విద్యుత్‌శాఖ ఏఈ ఆదిత్యకు చరవాణి ద్వారా గ్రామస్తులు, రైతులు సమాచారం అందించడంతో ఏఈ అందుబాటులో లేను రేపు ఉదయం గ్రామానికి వచ్చి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని రైతులకు చెప్పడంతో ధర్నా విరమించారు. దీంతో మూడు రోజుల్లో సెరపెల్లి(హెచ్) నుంచి పీడర్ వేసి సొనారికి, మలేగాం గ్రామానికి మూడు రోజుల్లో మలేగాం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సొనారికి సింగిల్ పేస్ అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, నారాయణ, నాగభూషణం, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల మధుర జ్ఞాపకాలు



నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002-03 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. అందరూ ఒకచోట కలుసుకొని ఎంతో సంతోషంగా జరుపుకున్నారు. మొదటగా వివిధ కారణాలతో మరణించిన స్నేహితులతో పాటు ఉపాధ్యాయులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించుకొని గురువులను ఎంతో ఘనంగా సన్మానించుకున్నారు. గురువులతో పాటు విద్యార్థులు మధుర జ్ఞాపకాలను ఒకరినొకరు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ చదువు సంస్కారాన్ని నేర్పించడం గురువు బాధ్యత ఆ చదువు సంస్కారాన్ని నేర్చుకొని, ప్రయోజకులు అయిన తర్వాత గురువులను గుర్తుపెట్టుకుని ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఒకే పాఠశాలలో చదువుకొని దాదాపు 23 సంవత్సరాల తర్వాత ఒకచోట కలిసి ఒకరి సాధక బాధకాలు గురించి పలకరించు కున్నారు. ఇక్కడితో ఆగకుండా ఎప్పటికి గురువును స్నేహితుని మర్చిపోవద్దన్నారు. కష్ట సుఖాలకు ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణ, గ్రామ ప్రముఖులు రామన్న యాదవ్, పూర్వ విద్యార్థులు శ్రీధర్‌రెడ్డి, సురేష్, సంజీవ్, వినోద్, నరేష్, జ్ఞానేశ్వర్, సంపత్, వివిధ గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను అక్రమ అరెస్ట్ చేయడం సిగ్గుచేటు

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్



ఆశాలను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రజాపాలన అని చెప్పుకొస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలు అని చూడకుండా ఆశ వర్కర్లను ముందస్తుగా అరెస్టు చేయడం సిగ్గుచేటని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం నాడు చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశా కార్యకర్తలను ఒకరోజు ముందుగా ఆదివారం ఆయా మండలాలలో పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న ఆశా కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే కార్మికులకు కనీస వేతనం అమలు చేస్తామన్న ఎన్నికల్లో హామీ అమలు చేయాలన్నారు. 24న కార్యక్రమం ఉంటే 23 నాడు ఉదయం నాలుగు గంటలకే అత్యుత్సాహంతో జిల్లా పోలీసులు అరెస్టు చేయడంతో ఆశాలు మానసికంగా ఇబ్బందులకు గురికావాల్సి వచ్చిందన్నారు. కార్మిక వర్గానికి నష్టం చేసే విధంగా పోలీసు వ్యవస్థ ఈ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తుందన్నారు. కరోనా సమయంలో ఆదుకున్న ఆశ వర్కర్ల సేవలను గుర్తించిన ప్రభుత్వమే నేడు వారి ఉద్యమాన్ని అణచివేసే ధోరణిలో వ్యవహరిస్తుందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆశాలకు నిర్ణీత వేతనం రూ.18వేలు అందేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. అలాగే ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం వర్తింపచేయాలని, అదనపు పనులకు అదనపు వేతనం, పారితోషకం లేని పనులను ఆశ వర్కర్లతో చేయించరాదని, ఆశ వర్కర్లపై అధికారుల వేధింపులు ఆపాలని, పండగ సెలవులు, వారాంతపు సెలవులకు సర్క్యూలర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆదిలాబాద్‌టౌన్ : ఆశాల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపిస్తే పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం సరైంది కాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. కాగా ఆదివారం ఆయనను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమస్యలు పరిష్కరించడం చేతకాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరాడుదామన్నారు. ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆశాలకు నిర్ణీత వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇచ్చి వేతనంలో సగం పెన్షన్ రూపంలో ఇవ్వాలన్నారు. రూ.50 లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో అభివృద్ధి

- బోథ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆడే గజేందర్



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని తేజాపూర్ గ్రామపంచాయతీలో ఆదివారం రూ.25లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులకు కాంగ్రెస్ బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ భూమిపూజ చేశారు. ఈ సంధ్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో మంత్రి సీతక్క సహకారంతో తేజాపూర్‌కు దాదాపు రూ.కోటితో అభివృద్ధి చేశామని, తేజాపూర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత తమదన్నారు. త్వరలోనే తేజాపూర్ ప్రజల చిరకాల వాంఛ హైలెవెల్ బ్రిడ్జి అంతేకాకుండా రోడ్‌ను కూడా మంత్రి సీతక్కచే మంజూరు చేయిస్తానని అన్నారు. ఆయన వెంట బోథ్ నియోజకవర్గ యువజన అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మొగులన్, విలాస్, అశోక్, స్వామీ, సతీష్, కృష్ణ, నిషంత్, గంగాధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సోమాసే వెంకట్‌రావ్(70) ఇకలేరు. ఆయన గత కొంత కాలం నుంచి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తుది శ్వాస విడిచాడు. 2004లో ఉమ్మడి రాష్ట్రంలోని వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన 2004 నుంచి 2006 వరకు రెండేళ్ల పాటు ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌తో మరో రెండేండ్లు పర్సన్ ఇన్‌చార్జిగా పని చేశాడు. కాంగ్రెస్‌నే నమ్ముకొని మండలంలోని సీనియర్ నాయకుడిగా పేరు పొందాడు.

ఆయన మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు...

మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సోమాసే వెంకట్ రావు మరణం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మీర్జా యాకుబ్, సీడాం భీంరావ్, మార్కెట్ కమిటీ చైర్మెన్ ముఖాడే ఉత్తం ఉన్నారు.

26న పండ్ల తోటల వేలం

నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ ఉట్నూరు పరిధిలోని ఉద్యాన నర్సరీ మామిడి పండ్ల తోటల వేలం ఈ నెల 26న నిర్వహిస్తున్న ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తోటలో బంగినపల్లి, దశేరి, తోతాపురి, హిమాయత్, లాంగ్ర వంటి మామిడి హైబ్రిడ్ రకాలు ఉన్నాయని, 2025 పంట కాలానికి ఈ పండ్ల తోటల వేలం జరుగుతున్నట్లు ప్రకటించారు. ఆసక్తి కలిగిన వ్యాపారస్తులు రూ. 10 వేల ధారావత్తు సొమ్ముతో 26న ఉదయం 10 గంటలకు వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. వేలంలో తోటను దక్కించుకున్నవారు సగం సొమ్మును వెంటనే చెల్లించాలని, మిగతా సొమ్మును వారంరోజుల్లో చెల్లించాల్సి ఉంటుందని, మొత్తం సొమ్ము చెల్లించాకే కాయలు కోయటానికి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి, సంబంధిత నర్సరీ సాంకేతిక అధికారి సెల్: 8897478825, 9441020755 సంప్రదించాలని పేర్కొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో పాలకులపై పోరాడుతాం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్
- పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భగత్ సింగ్ స్ఫూర్తితో పాలకులపై పోరాడుతామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. ఆదివారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతిని, సీపీఐ(ఎం), ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సుందరయ్య భవనం నుంచి భగత్ సింగ్ విగ్రహం వరకు డప్పు చప్పుళ్ల మధ్య కోలాహలంతో ర్యాలీ నిర్వహించారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ హోరెత్తించారు. అనంతరం భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ కుల మతాలను విసర్జించాలని, అప్పుడే ఈ దేశం ముందుకు వెలుతుందన్నారు. కానీ నేటి పాలకులు కులం, మతం ఆధారంగా రాజ్యాన్ని పరిపాలిస్తున్నారని అన్నారు. మతాల మధ్యన ద్వేషం నింపి మరణ హోమంగా మారుస్తున్నారని మండిపడ్డారు. లౌకిక రాజ్యాంగాన్ని మార్చి మత రాజ్యాంగాన్ని తీసుకొచ్చే కుట్రలు చేస్తున్నారని అన్నారు. సామజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోరుకున్న భగత్ సింగ్ ఆశయాలు నేటికీ నెరవేరలేదని అన్నారు. భగత్ సింగ్ ఆశయ సాధన కోస ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, మున్సిపల్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు మెరుగు జనార్ధన్, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత, రిమ్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పండుగ పోచ్చన్న, ఐద్వా జిల్లా కార్యదర్శి లంక జమున, నాయకులు విజయ, పంచపుల, పూసం షయబాయి, ఎన్పీఆర్డీ అధ్యక్షురాలు అరిఫా బేగం పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో...

పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలోనూ భగత్ సింగ్ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ యుక్త వయస్సులోనే దేశం కోసం పోరాడిన వీరుడని కొనియాడారు. బ్రిటిష్ పాలకుతో ఉరి కొయ్యలు ఎక్కిన బాదపడలేదన్నారు. బ్రిటిస్‌కు హటావో దేశ్‌కు బచావో అనే నినాదంతోనే ఉద్యమించారని తెలిపారు. కానీ కేంద్రంలోని బీజేపీ అలాంటి యోధులకు భారత రత్న అవార్డు ఇవ్వలేదన్నారు. బీజేపీకి అనుకూలంగా ఉన్నవ్యక్తులనే గుర్తించి అవార్డు ఇవ్వడం సరైంది కాదన్నారు. భగత్ సింగ్ కూడా ప్రతి సంవత్సరం భారత రత్న అవార్డు ఇచ్చిన ఆయన త్యాగం ముందు తక్కువేనని అన్నారు.

యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో...

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా యూఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఓ కళాశాలలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్ మాట్లాడుతూ భగత్ సింగ్ స్ఫూర్తితో ఇప్పుడున్న యువత డ్రగ్స్ గంజాయిని వ్యతిరేకిద్దామన్నారు. భవిష్యత్తు విద్యార్థులను కాపాడుదమన్నారు. చదువుకుంటేనే ఏదైనా సాధించవచ్చని అన్నారు. యువత ఏ సమస్య ఉన్న భగత్ సింగ్ లాగా ప్రశ్నించాలని, ప్రశ్నించేతత్వం పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అల్తాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా 23 ఏండ్లకే ఉరికొయ్యను ముద్దాడి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం భారత రత్నా అవార్డు ప్రకటించాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూసం సచిన్ డిమాండ్ చేశారు. ఆదివారం భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం మండల కేంద్రంలోని గిరిజన డిగ్రీ కళాశాల హాస్టల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాద దాస్య శృంఖలాల నుండి భారతదేశాన్ని విముక్తం చేయడానికై 23 ఏండ్ల చిరు ప్రాయంలోనే ప్రాణార్పణ గావించిన అమరవీరుడు షహీద్ భగత్‌సింగ్ అని అన్నారు. 1931, మార్చి 23న నాటి బ్రిటీష్ పాలకులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను లాహోర్ జైలులో ఉరితీశారని పరాయి పాలకులను దేశం నుంచి తరిమికొట్టాలనే ఆకాంక్షతోనే ఆగిపోకుండా స్వతంత్ర భారతదేశంలో ఎలాంటి విధానాలు అవలంబిస్తే ప్రజలకు మేలు కలుగుతుందనే విషయంలోనూ సమగ్ర దృక్పథం కలిగిన కొద్దిమంది స్వాతంత్ర్య ఉద్యమకారుల్లో భగత్‌సింగ్ ఒకరని కొనియాడారు. నేటి యువత భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడిచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం తనుష్, జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, ఉపాధ్యక్షులు కోవా సునీల్, విద్యార్థులు మురళి, నవీన్, దేవిదాస్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ :ఏఐఎస్ఎఫ్ నిర్మల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చి, జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని భగత్ సింగ్‌కి భారత రత్న ప్రకటించి భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ చట్టం అమలు చేయాలన్నారు. అలాగే ఆయన పోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువత తమ హక్కుల కోసం ఉద్యమించాలన్నారు.

నిర్మల్‌రూరల్ : భారతదేశ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ఉరికొయ్యలను ముద్దాడిన విప్లవ వీరుడు భగత్ సింగ్ అని పీడీఎస్‌యూ నిర్మల్ జిల్లా అధ్యక్షులు సింగారి వెంకటేష్ అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎస్టీ బాలుర కళాశాల హాస్టల్ వసతి గృహంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు తరుణ్, సంతోష్, ఆదికేశవ, రామ నాయుడు, కళ్యాణ్, కిషోర్, శివ, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | మార్చి 24, 2025 | www.navatelangana.com

30న శాంతియుత నిరసన దీక్ష

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మశాలి భవన కమిటీకి ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఈ నెల 30న స్థానిక ఎల్లాగౌడ్‌తోటలోని పద్మశాలి భవనం ముందు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు శాంతియుత నిరసన దీక్ష చేపట్టనున్నట్లు పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు దాసరి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్‌కుమార్ తెలిపారు. ఆదివారం వారు సంఘ సభ్యులతో కలిసి బస్టాండ్ సమీపంలోని సామల సదాశివ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ భవనానికి గత మూడు దశాబ్దాలుగా ఒకే కమిటీ కొనసాగుతోందని, దీనికి ఎన్నికలు జరిపి నూతన కమిటీని ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు గడదాసు నారాయణతో పాటు పలువురు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళా మృతి

- ఆటో డ్రైవర్ పై కేసు నమోదు

నవతెలంగాణ-బెజ్జూర్

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన రేసీ సత్య భాయి(55) మహిళను ఆటో డీ కొట్టడంతో తీవ్ర గాయాలై ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఇటీవల మండల కేంద్రంలో బెజ్జూరు గ్రామపంచాయతీ సమీపంలోని కల్వర్టు వద్ద మహిళను బెజ్జూరు గ్రామానికి చెందిన రమేష్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు మృతురాలి కూతురు కమల తెలిపారు. తాగిన మైకంలో డ్రైవర్ రమేష్ జాగ్రత్తగా, నిర్లక్ష్యంగా, నడపడం వల్ల సత్యబాయి మహిళ మృతి చెందినట్లు మృతురాలి కూతురు కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ గోరంట్ల రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

క్రీడలతో పోరాట స్ఫూర్తిని అలవర్చుకోవాలి

- ఎమ్మెల్సీ దండే విఠల్
- మండలంలో పలు సీసీ రోడ్లకు శంకుస్థాపన



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

క్రీడలతో యువత పోరాట స్ఫూర్తిని అలవర్చుకోవాలని, క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేత గుండ్లపేట జట్టుకు రూ.40,000 నగదు, ట్రోఫీ, రన్నర్ టీం ఎలకపల్లి జట్టుకు రూ.20 వేల నగదును అందజేశారు. అంతకుముందు ఆయన పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. మండల కేంద్రంలో రూ.45 లక్షల సీసీ రోడ్లు, ఎస్సీ కమ్యూనిటీ హాల్ మిగతా నిర్మాణ పనులకు రూ.8 లక్షలు, దర్గాపల్లి గ్రామంలో రూ.10 లక్షలు, చేద్వాయి గ్రామంలో రూ.10 లక్షలు, గొంట్లపేట, పోతేపల్లి గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని అన్నారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామాలకు మూలమూలన సీసీ రోడ్ వేయించే బాధ్యత తమ ప్రభుత్వానిదే అన్నారు. గ్రామాల్లో రోడ్లకు నాణ్యత ప్రమాణాలు పాటించి పటిష్టంగా వేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఇచ్చిన హామీలను పక్కగా అమలు చేస్తామన్నారు. అదే విధంగా యువకులు క్రీడలతో పోరాట స్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సిడం గణపతి, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, దహెగాం మాజీ జడ్పీటీసీ రామారావు, నాయకులు సముద్రాల రాజన్న, రాచకొండ కృష్ణ, చౌదరి శ్రీనివాస్, గజ్జల సురేష్, భక్తు రామచందర్, సుంకర చందు పాల్గొన్నారు.



కొత్తపల్లి (సి) గ్రామంలో నీటి సమస్య



నవతెలంగాణ-జైనూర్

కొత్తపల్లి (సి) గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని లింగాపూర్ బీజేపీ మండల అధ్యక్షులు ఆడే సురేష్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లి గ్రామ ప్రజలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 20 రోజుల నుండి తాగునీరు రాక గ్రామ ప్రజలు నీటి కోసం, రోడ్లపైకి వచ్చి నిరసన చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా నీరు అందడం లేదన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ విషయంలో చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా సజావుగా జరిగేలా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. అధికారులు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు వేలం పాట

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని గోయగాం, వాంకిడి బజారు వేలం పాటను నిర్వహించడం జరుగుతుందని గోయగాం, వాంకిడి కార్యదర్శులు స్రవంతి, శివ ఆదివారం తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఉదయం 10 గంటల నుండి ఒంటి గంట వరకు వేలం పాట నిర్వహించడం జరుగుతుందన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు గ్రామ పంచాయతీలో సంప్రదిస్తే కావాల్సిన వివరాలను తెలియజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాన్వాట్‌లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని వాన్వాట్ గ్రామంలో ఆదివారం గ్రామ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీజేపీ మండల అధ్యక్షుడు బంటిపెల్లి దయాకర్, ప్రముఖ వ్యాపారవేత్త హిందుస్థాన్ ఆగ్రో సైన్స్ చైర్మన్ మస్కరి పోతన్న హాజరై ఈ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జలపతిరావు, మాధవరావు, కేమనందు, భీంరావ్, కేమ శ్రీకాంత్, నజీర్ పాల్గొన్నారు.



గుర్తిస్తే క్షయ నిర్మూలన సాధ్యమే..

- వ్యాధి రాకుండా జాగ్రత్తలు పాటించాలి
- జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు
- నేడు ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం



సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రోజురోజుకు సాంకేతిక పరిజ్ఞానం పెరగడం, బయోరంగం విస్తరిస్తుండడంతో క్షయ వ్యాధికి మందులు వచ్చాయి. సరైన జాగ్రత్తలు పాటిస్తే ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. ప్రాణాలు తీసే క్షయ వ్యాధి మైకోబ్యాక్టీరియం టూబర్‌క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల సోకుతోందని 1882 మార్చి 24న జర్మనీ శాస్త్రవేత్త రాబర్ట్ కుచ్ తెలుసుకున్నాడు. దాని నివారణకు ప్రయత్నించాడు. ఈ వ్యాధి ప్రభావం వెనుకబడిన ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. ప్రసుతం జిల్లాలో దాదాపు 600 పైగా యాక్టివ్ కేసులున్నాయి. నేడు ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక కథనం.

క్షయ వ్యాధి లక్షణాలు

గొంతులో ఏదో (కఫం) ఉన్నట్లు దగ్గు వస్తూ ఉంటుంది. దగ్గకుండా ఉందామన్నా ఉండలేం. పొడి దగ్గు వస్తూ ఉంటుంది. రెండు వారాల్లో పొడి దగ్గును తగ్గించేసుకోవాలి. లేదంటే అదే క్షయ వ్యాధి వచ్చేందుకు కారణం అవుతుంది. క్షయ వస్తే ఇక దగ్గు ఆగదు. కంటిన్యూగా వస్తూనే ఉంటుంది. సాయంత్రం, రాత్రి వేళల్లో జ్వరం వస్తూ ఉంటుంది, చెమటలు పడతాయి. బరువు తగ్గిపోతూ ఉంటారు. ఇవి స్పష్టంగా కనిపించే లక్షణం. ఎంత తిన్నా బరువు తగ్గిపోతారు. అసలు ఆకలే వెయ్యదు. పెద్దగా పని చేయకపోయిన ఆయాసం వచ్చేస్తుంది. నీరసం కూడా వస్తుంది. వ్యాధి ముదురుతూ ఉంటే, దగ్గుతో పాటూ (కఫంతో) రక్తం కూడా వస్తుంది.

వ్యాధి రాకుండా ఏం చేయాలి

మంచి ఆహారం తీసుకోవాలి. స్పైసీ (మసాలా) ఫూడ్ తగ్గించాలి. దగ్గు, జలుబు, జ్వరం లాంటి వాటిని వీలైనంత త్వరగా తగ్గించేసుకోవాలి. రెండు వారాల కంటే ఎక్కువ రోజులు పొడి దగ్గుఉంటే, వెంటనే డాక్టర్‌ను కలవాలి. పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధరణ అయితే వెంటనే చికిత్సలు తీసుకోవాలి.

వచ్చిన వ్యాధి తగ్గాలంటే ..

స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉచితంగా పరీక్షలు చేస్తారు. క్షయవ్యాధి ఉన్న వారికి నెలకు రూ.500లను ప్రభుత్వం నేరుగా బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తోంది. కొంతమందిలో సాధారణంగా మందులు వాడగానే వ్యాధి తగ్గిపోతుంది. తాగుడు, స్మోకింగ్ వంటి అలవాట్లు ఉంటే, వ్యాధి త్వరగా తగ్గకపోగా, ఎండీఆర్ టీబీ (మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ టీబీ)గా మారుతోంది. వ్యాధి నిర్ధారణ సమయంలో రోగికి సాధారణ టీబీ ఉందా లేక ఎండీఆర్ టీబీ ఉందా అనేదానిని నిర్ధారిస్తారు. క్షయకు ఇచ్చిన మందులు ఎక్కువ కాలం వాడాల్సి ఉంటుంది. మధ్యలో మానేస్తే ప్రమాదం. మళ్లీ వచ్చేస్తుంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో క్షయ వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలనే ఉద్దేశ్యంతో జిల్లాలో గతంలో పదిహేను రోజులపాటు వైద్య సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దీని కోసం 780 మంది ఆశా కార్యకర్తలు 780 మంది వాలంటీర్లను ఉపయోగించారు. ఇంటింటికి వెళ్లి అనుమానితులను గుర్తించేల సర్వే నిర్వహించారు. వ్యాధి లక్షణాలను తెలియజేస్తూ అవగాహన కల్పించారు.



క్షయ వ్యాధి నివారణే లక్ష్యం

సీతారాం, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి

జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. దీనికోసం ప్రతి సంవత్సరం సీజన్‌లో 15 రోజులపాటు ప్రత్యేక సర్వే నిర్వహించి, వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించడంతో పాటు దాని నివారణకు అవసరమైన మందులు అందజేయడంతో పాటు పాటించాల్సిన అంశాలను వారికి వివరించడం జరుగుతుంది. అంతర్గతంగా మచ్చలు లాంటివి ఉన్నవారు తప్పనిసరిగా వైద్య సిబ్బంది సలహాలు తీసుకోవాలి. వ్యాధి రహిత జిల్లా చేయడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

ఎకరానికి రూ. 30 వేలు పరిహారం చెల్లించాలి

- సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు



నష్టపోయిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇటీవల వీచిన వడగళ్ల వానతో పాటు భారీ గాలికి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 30 వేలు పరిహారం చెల్లించాలని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం విలేజ్ నెం. 2, 12లలో పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట చేతికొచ్చే దశలో రైతులకు అపార నష్టం జరిగిందనీ, భారీ గాలితో నియోజకవర్గంలో వేలాది ఎకరాల పంట నష్టానికి గురైందని అన్నారు. వ్యవసాయాధికారులు పూర్తి స్థాయిలో సర్వే చేపట్టి పంట నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు. అసెంబ్లీ సమావేశాలలో కూడా దీనిని ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకాన్ని పకడ్బంధీగా అమలు చేస్తే అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునే అవకాశం ఉంటుందనీ, కాని రాష్ట్ర ప్రభుత్వం దీనిని రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. కనీసం ఖరీఫ్ సీజన్ నుండి ఈ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు బికాస్ గరామీ, మాజీ ఎంపీపీలు మనోహర్‌గౌడ్, కొప్పుల శంకర్, నాయకులు అమిత్ బిశ్వాస్, సమీర్ గుప్తా, దీపక్ గెయిన్, అషుతోష్ మండల్, గోవింద్ మండల్, కను కమల్ సర్కార్ పాల్గొన్నారు.

భగత్ సింగ్ వర్ధంతి అధికారికంగా నిర్వహించాలి



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని భగత్ సింగ్ చౌక్‌లో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌ల 94వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌ల చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాలలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితం భారతదేశ యువతకు స్ఫూర్తిదాయకమని, అటువంటి మహనీయుల త్యాగాలను నేటి సమాజానికి తెలిపాల్సిన బాధ్యత పాలకులదేనన్నారు. భగత్ సింగ్ వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలని కోరారు. ప్రజల ఐక్యతను చీల్చే మతోన్మాద రాజకీయాలు నేడు దేశంలో విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనైనా నేటి కాలంలోనైనా అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చి దోపిడిదారులకు ఉపకరించే, దేశద్రోహ కర్తవ్యాన్నే మతోన్మాద శక్తులు నెరవేరుస్తున్నాయని ధ్వజమెత్తారు. దేశ స్వాతంత్ర్య సముపార్జన ధ్యేయంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్ స్వాతంత్ర్య అనంతరం కుల, మతాలకు అతీతంగా ధనిక, పేద తారతమ్యాలు లేని అవినీతిరహిత సమసమాజ స్థాపనకు కలలు కన్నారని తెలిపారు. మతోన్మాద ముక్త భారతం సాధించడానికి భగత్ సింగ్ ఆలోచనలు, ఆయన చూపిన కార్యాచరణ, మనకు తరగని స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఇనుప కండరాలు, ఉక్కునరాలు గల యువత దేశానికి అవసరమని ప్రబోధించి సూక్తిగా నిలిచి "ఆత్మ విశ్వాసంకు మించిన ఆయుధం లేదని చాటి చెప్పిన భగత్ సింగ్ ప్రేరణతో, యువజనులతో మమేకమై ఉత్తేజ, ఉద్వేగభరితమైన ఉద్యమాలు సాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు కొదురుపాక మహేష్, బావునే వికాస్, వర్కోలు రాకేష్, గోగుల మల్లికార్జున్, టేకం అంజు, ధర్మి రాకేష్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్ 94వ వర్ధంతిని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలికల వసతి గృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి పోరాటస్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, జిల్లా నాయకులు దుర్గం కోటేశ్వర్, అయ్యుబ్ ఖాన్, తాజ్, హాస్టల్ నాయకులు అక్షిత, చాందిని, ప్రేరణ, శివాంజలి, ప్రవళిక, నాగిని, సృష్టి, సంజన, పల్లవి, నాగేశ్వరి పాల్గొన్నారు.



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

సంస్థాగత నిర్మాణం కోసం పనిచేయాలి

- రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ పార్టీ సంస్థ గత నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు పనిచేయాలని రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మన్, జేబీ, జేఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఈరవర్తి అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వోడపల్లి గార్డెన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు అధ్యక్షతన జరిగిన జై బాపు, జై భీమ్, జై సంవిధన్ కార్యక్రమానికి ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం సర్వస్వం అంకితం చేసిన గాంధీ లాంటి మహనీయులను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం దేశంలో బీజేపీ మతతత్వ రాజకీయాలను కొనసాగిస్తుందని ఆరోపించారు. క్విట్ ఇండియా ఉద్యమానికి ద్రోహం చేసింది వారేనని అన్నారు. బీజేపీ అంటరాని తనాన్ని ప్రవేశపెట్టినందుకు పన్నాగం పండుతుందని ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబాసాహెబ్ అంబేద్కర్‌ని అవమానిస్తున్నారని తెలిపారు. అంబేద్కర్ లేకపోతే పరిస్థితి ఎలాగ ఉండేదో అందరికీ తెలుసన్నారు. అదాని, అంబానీ లాంటి కార్పొరేట్ వ్యవస్థల కోసం బీజేపీ పని చేస్తుందన్నారు. రాహుల్ గాంధీ దేశంలో కులగణన చేయాలని డిమాండ్ చేస్తే బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. బీసీలకు అన్యాయం జరుగుతున్న బీజేపీలోని బీసీ నాయకులు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు ఆమోదం చేసి కేంద్రానికి పంపించిందని, బేషరతుగా తొమ్మిదవ షెడ్యూల్లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ పని చేస్తుందని, అణగారిన వర్గాల కోసం రాహుల్ గాంధీ పాటుపడుతున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్ చేసిందని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ ఎందుకు చేయడం లేదని మందకృష్ణను ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రణాళిక ప్రకారం అమలు చేస్తుందని ఉచిత బస్సు, గ్యాస్ సబ్సిడీ, వరికి రూ.500, రుణమాఫీ ఉద్యోగాల భర్తీ ఇలా అనేక పథకాలను ప్రవేశపెడుతుందని తెలిపారు. కాంగ్రెస్ పని ఎక్కువ చేస్తుందని పబ్లిసిటీ తక్కువ చేస్తుందని కానీ బీఆర్ఎస్ పబ్లిసిటీ ఎక్కువ పని తక్కువ చేస్తుందని చురుకులు అంటించారు. పార్టీ ఆదేశాల మేరకు జై బాపు జై భీం జై సంవిధన్ పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు భాస్కర్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్ నాయక్, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, మాజీ ఎమ్మెల్యే సక్కు, మాజీ జడ్పీ చైర్మన్ గణపతి, యువజన జిల్లా అధ్యక్షుడు గుండా శ్యామ్, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు గాదవేణి మల్లేష్, మునీర్, మాజీ ఎంపీపీ బాలేష్, పార్టీ మండల అధ్యక్షుడు మసాదే చరణ్, నాయకులు వసంతరావు, అసద్, శివప్రసాద్, గోపాల్ నాయక్, రఫు, జావీద్ పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర వాల్‌పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో హిందూ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 12న నిర్వహించే శ్రీ వీర హన్మాన్ శోభాయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హిందూ జాగరణ మంచ్ సభ్యులు శివగౌడ్, ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రముఖ్ రంగస్వామి, జిల్లా ప్రచార్ ప్రముఖ్ దుర్గం పురుషోత్తంలు మాట్లాడుతూ ప్రతీ ఏటా ఏప్రిల్ 12న కాగజ్‌నగర్‌లో భారీ ఎత్తున శోభాయాత్ర నిర్వహించడం ఆనావాయితీగా వస్తోందని, ఈ ఏడాది కూడా శోభాయాత్రకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక బాలభారతి సమీపంలోని హన్మాన్ మందిర్ నుండి శోభాయాత్ర ప్రారంభమై పట్టణంలోని పలు ప్రధాన రహదారుల గుండా తిరిగి హన్మాన్ ఆలయం చేరుకుంటుందని తెలిపారు. దీనికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో హిందూ జాగరణ మంచ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ ఆప్టోమెట్రిస్ట్ డే వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆప్టోమెట్రిస్ట్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం వరల్డ్ ఆప్టోమెట్రిస్ట్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చిన్న, పెద్ద తేడా లేకుండా అందరు కంటి సమస్యలతో బాధపడుతున్నారన్నారు. గతంలో కంటి వెలుగు కార్యక్రమంలో ఉపయోగించిన అనేక పరికరాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయని, మూలనపడిన ఆ పరికరాలను ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రతి పీహెచ్‌సీ, సబ్‌సెంటర్, బస్తీ దవాఖానాల్లో కంటి వెలుగులో పని చేసిన వారిని కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకుని ప్రజాప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ ప్రభుత్వం ఆప్టోమెట్రిస్టులను గుర్తించి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో తమను నియమించి సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, ఆప్టోమేట్రిస్టులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజం కోసం కృషి చేయాలి

నవతెలంగాణ-తాండూర్



టీబీ రహిత సమాజం కోసం కషి చేయాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. టీబీకి లక్షణాలు కనిపిస్తే ఆరోగ్య, వైద్య సిబ్బంది సంప్రదించి పరీక్షలు చేయించుకుని నిర్ధారించుకోవాలన్నారు. ప్రభుత్వ దవాఖానాల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహించి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శశికాంత్, వెంకటేష్, చెన్నకేశవులు, టీబీ వ్యాధి నిర్ధారణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

నవతెలంగాణ-మంచిర్యాల



జిల్లా కేంద్రంలోని ఓ ప్రైయివేటు ఫంక్షన్‌హాల్లో ఆదివారం నస్పూర్‌లోని కేం బ్రిడ్జ్ పాఠశాలకు చెందిన 2000 సంవత్సరానికి చెందిన ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏండ్ల తరువాత ఒకచోట కలుసుకొని యోగ క్షేమలు తెలుసుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు నేర్పిన గురువులను సన్మానించారు. ఇందులో పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశా, మధ్యాహ్న భోజన కార్మికుల అరెస్ట్ సరికాదు

నవతెలంగాణ-మంచిర్యాల

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి బయలుదేరుతున్న మధ్యాహ్న భోజన, ఆశా కార్యకర్తలను అరెస్ట్ చేయడన్ని సీఐటీయూ నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా ఆదివారం అరెస్ట్ అయిన ఆశా, మధ్యాహ్న భోజనం కార్మికులకు మద్దతు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరిన ఆశ, మధ్యాహ్నం భోజన కార్మికులను అరెస్ట్ చేయడం అన్యాయం అన్నారు. ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా అంటూ మండి పడ్డారు. హామీలు అమలు చేయాలని గత సంవత్సరం నుంచి ఎమ్మెల్యేలకు అధికారులకు వినతి పత్రాలు అందించినప్పటికి సమస్యలు పరిష్కారానికి కృషి చేయలేదని, ప్రజల ఆరోగ్యన్ని కాపాడే ఆశా వర్కర్‌లకు వేతనాలు పెంచకుండా ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని విద్య వైద్యనికి కూడా ఆశా, మధ్యాహ్నం భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. నిత్య అవసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని వాటిని దృష్టిలో పెట్టుకొని ఆశా వర్కర్లకు, మధ్యాహ్నం భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయివారిని వెంటనే విడుదల చేసి ఎన్నికల ముందు వారికి ఇచ్చిన హామీలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్బోజు రమణ, దుంపల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.



మంచిర్యాలలో అరెస్టు అయిన ఆశా కార్యకర్తలు



లక్షెట్టిపేటలో..

జన్నారం : ఛలో ఇందిరా పార్క్ ధర్నాకు వెళ్లకుండా పోలీసు ఎండీఎం కార్మికులను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికరం అశోక్ అన్నారు. ముందస్తు అరెస్టును ఖండిస్తూ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎండీఎం కార్మికులకు రూ.10 వేల వేతనం ఇస్తామని. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని, దాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. ఇచ్చిన హామీలు, తమ హక్కుల సాధనకై ధర్నా వెళ్తుండగా పోలీసులు అక్రమ అరెస్టులకు పాల్పడడం తగదన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎండీఎం అధ్యక్షురాలు సేపూరి లక్ష్మి, ఉపాధ్యక్షురాలు అమృత, వసంత పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : మండల పరిధిలోని పనిచేస్తున్న ఆశా వర్కర్లను, మధ్యాహ్న భోజన కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. తమకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు వెళ్లకుండా ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు.



జన్నారంలో..

జాతీయస్థాయి క్రీడా పోటీలకు జిల్లా క్రీడాకారులు



నవతెలంగాణ-మంచిర్యాల

బీహార్‌లో ఈ నెల 24 నుండి 30వ తేదీ వరకు నిర్వహించే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపిక అయినట్లు జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొనె శ్యామ్ సుందర్ రావు, కనపర్తి రమేష్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం విద్యార్థులను సన్మానించారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మూడో స్థానం కైవసం చేసుకుంది. ఈ పోటీలలో అత్యంత నైపుణ్యాన్ని ప్రదర్శించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ క్రీడాకారులు జూమిడి కార్తీక్, కోటపల్లి. శ్యామ్, వేమనపల్లి. సిద్ధార్థ్, మందమర్రి మండలానికి చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపిక అయినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలతో పాటు కోశాధికారి అలుగువెల్లి రమేష్‌రెడ్డిలు మిఠాయిలు తినిపించి అభినందించారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పీడీలు రోజ, వర కుమారి, రేణి రాజయ్య, ఎస్జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా, హ్యాండ్ బాల్ కోచ్ సునార్కర్ అరవింద్, కళ్యాణ్ క్రీడాకారులను అభినందించారు.

అమాయకులే టార్గెట్‌గా రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్ళు

- రూ.2.12 లక్షలు పోగొట్టుకున్న ఓ యువకుడు

నవతెలంగాణ-మందమర్రి

అమాయకులే టార్గెట్‌గా రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్ళు. గూగుల్‌లో రివ్యూ ఇస్తూ డబ్బులు సంపాదించవచ్చునని రూ.2.12 లక్షలు పోగొట్టుకున్నాడో యువకుడు. వివరాల్లోకి వెళితే.. మందమర్రికి చెందిన యువకుడికి(22)కి రెస్టారెంట్లకి రివ్యూ ఇస్తూ డబ్బులు సంపాదించవచ్చునని ఇటీవల టెలిగ్రాంలో ఓ మెసేజ్ వచ్చింది. అత్యాశతో సదరు యువకుడు సరే అన్నాడు. నేరగాళ్ల అతడ్ని 3000 మంది ఉన్న టెలిగ్రాం గ్రూపులో యాడ్ చేశారు. కొన్ని డబ్బులు పంపుతూ ఎక్కువ డబ్బులు తిరిగి వచ్చేలా మొదట నమ్మించారు. డబ్బులు సంపాదించడానికి ఎక్కువ ఇన్వెస్ట్మెంట్ చెయ్యమనగా మొత్తం 2.12 లక్షలు అమౌంట్ పంపించాడు. డబ్బులు విత్ డ్రా చేయడానికి ఎంత ప్రయత్నించినా క్రెడిట్ అవ్వలేదు. నిర్వాహకులని కాంటాక్ట్ చేసినా ఫలితం లేకపోవడంతో బాధితుడు మోసపోయానని గ్రహించి ఆదివారం మందమర్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం



నవతెలంగాణ-మంచిర్యాల

భగత్ సింగ్ 94వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు మిడివెల్లి రాజ్‌కుమార్, అభినవ్ మాట్లాడుతూ భగత్ సింగ్ నేటి యువతకు ఎంతో స్ఫూర్తి దాయకమని, దేశభక్తి అంటే దేశాన్ని మెరుగుపరిచే పని చేయడమని అవసరమైతే స్వాతంత్ర సమర యోధుల లాగ ప్రాణాలను సైతం అర్పించాలని అన్నారు. 23 సంవత్సరాల వయసులో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశం కోసం పోరాడి ఉరి కభం ఎక్కాడని, భగత్‌సింగ్ బలమైన యువకుడే కాకుండా బలమైన ఆలోచన కలిగిన మహా నాయకుడని కొనియాడారు. పెద్ద మొత్తంలో విద్యార్థులు, యువకులు రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్, మహేష్, సాయి, ప్రకాష్, బ్లడ్ క్యాంప్ ఆర్గనైజర్ ప్రేమ్ పాల్గొన్నారు.

కేకే ఓసీపీని సందర్శించిన సింగరేణి డైరెక్టర్



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ (పీఏఅండ్‌డబ్ల్యూ), వెంకటేశ్వర్లు ఏరియా జీఎం దేవేందర్‌తో కలిసి ఆదివారం కేకే ఓసీపీ సందర్శించారు. డైరెక్టర్‌కి జీఎం మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పని ప్రదేశాలను పరిశీలించి, ఉత్పత్తి ఉత్పాదకత పై సమీక్షించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు సలహాలు, సూచనలు అందించారు. ప్రతి ఒక్కరు అంకిత భావంతో పనిచేసినప్పుడే నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజినల్ సేఫ్టీ జీఎం రఘు కుమార్, ఎస్ఓటు జీఎం విజయ ప్రసాద్, కేకేఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, గనుల మేనేజర్లు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-జన్నారం

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత, అలాగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు శాసనసభలో ఆమోదింపజేసి దేశానికి మార్గంచూపిన సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, మద్దతు తెలిపిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, పట్టణ అధ్యక్షుడు దుమాల రమేష్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేదలకు అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ,వైస్ చైర్మన్ ఫాసిల్లా, డైరెక్టర్లు లావణ్య, ప్రదీప్, నర్సయ్య, మండల నాయకులు రాజశేఖర్, ఇస్సాకు,మోహన్ రెడ్డి,మచ్చ శంకరయ్య, నందు నాయక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మామిడిపెల్లి ఇందయ్య, బీసీ సెల్ ప్రెసిడెంట్ బినవేణి రాజన్న, ఎస్ టి సెల్ జిల్లా అధ్యక్షులు నందునాయక్, ముత్యం సతీష్, సుధీర్,గాజుల సత్తన్న, శిరీష్,అజార్, శంకర్ గౌడ్, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర నాయకులు సోహేల్,యూత్ కాంగ్రెస్ నాయకులు అజ్మత్, ప్రవీణ్,ముజ్జు, రాకేష్, నరేష్ జిలకార గంగన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : మండలంలోని ఎల్లారం గ్రామంలో బీసీ, ఎస్సీ రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పింగిలి రమేష్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, డెప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచుకుని, టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు దుంపల ప్రేమ్‌సాగర్, యూత్ అధ్యక్షుడు గొర్ల సుధాకర్, మాజీ సర్పంచులు మల్యాల సత్తయ్య, మెట్పల్లి రాజారావు, మాజీ ఉపసర్పంచ్ సత్తయ్య, వార్డు సభ్యులు ఆకుల గురుశరణం, మాల్కారి పోచయ్య, గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సందెల శ్రీనివాస్, అక్కల శంకరయ్య, రాజలింగు, గంగాధర్, ఆనంద్, మల్లేష్, సాయి పార్టీ నాయకులు పాల్గొన్నారు.



లక్షెట్టిపేట : సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విధులు నిర్వహిస్తూనే యాజమాన్యంపై పోరాడాలి



సీఐటీయూలో చేరిన సింగరేణి కార్మికులను కండువా కప్పి ఆహ్వానిస్తున్న రామగిరి స్వామి

నవతెలంగాణ-మందమర్రి

విధులు నిర్వహిస్తూనే యాజమాన్యంపై పోరాడాలని సీఐటీయూ మందమర్రి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు రామగిరి రామస్వామి కార్మికులకు సూచించారు. ఆదివారం రామకష్టాపూర్ సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువ కార్మికులు యూనియన్‌లో చేరగా కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. అనంతరం బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఈ మధ్య తరచుగా గనులలో ప్రమాదాలు జరుగుతున్నాయని, కొన్నింటికి రిపోర్టులు రాయకుండా కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గెలిచిన సంఘాలు తమ వంతు బాధ్యతగా కార్మికులకు అండగా ఉండకపోగా యాజమాన్యానికి అనుకూలంగా మారి కార్మికులకు నష్టం జరిపే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. యాజమాన్యంతో తమకు అనుకూలంగా ఉన్నప్పుడు ఒకలా అనుకూలంగా లేనప్పుడు మరోలా ప్రవర్తించడం మానుకొని కార్మికుల పక్షాన నిలబడాలని అన్నారు. మూడు నెలలుగా స్ట్రక్చర్ సమావేశాలు ఏరియాలో నిర్వహించినప్పటికీ పలు సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయని వాటిపై ఒత్తిడి చేసి పరిష్కరించాలని అన్నారు. కార్మిక సమస్యలపై సీఐటీయూ పెంచుతున్న అవగాహన గమనించిన యువ కార్మికులు రోజు రోజుకూ పెద్ద ఎత్తున చేరుతూ యూనియన్‌ను బలోపేతం చేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో సమయ వేళల మార్పుపై, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వడంపై గుర్తింపు సంఘం స్పందించకపోవడం సరికాదన్నారు. నాయకులు పైపైన తిరగకుండా గనులలోకి దిగి వారి పని వారు చేసినప్పుడే కార్మికులపై ఎంత ఒత్తిడి ఉన్నదో తెలుస్తుందని, అప్పుడే సమస్యలపై యాజమాన్యాన్ని ప్రశ్నించగలుగుతారని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్గనైజర్ డి సురేష్, లింగాల రమేష్, ఆయిందాల శ్రీనివాస్, ఆదర్శ్, పి నాగరాజు సీనియర్ నాయకులు అలవల సంజీవ్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నవతెలంగాణ-మందమర్రి

మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్స్ స్కూల్‌లో ఆదివారం గ్రాడ్యుయేషన్‌డేను ఘనంగా నిర్వహించారు. పిల్లలు కిండర్ గార్డెన్ విద్యను ముగించుకొని ఒకటవ తరగతిలోకి వెళ్లబోతున్న సందర్భంగా అందుగుల పేటలోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో లిటిల్ ఫ్లవర్స్ చోటా స్కూల్ గ్రాడ్యుయేషన్ డే ని ఘనంగా నిర్వహించారు. మండల ఎస్ఐ రాజశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలని క్రమశిక్షణతో ఉన్నత స్థాయిలో నిలిచే విధంగా చదివించాలని సూచించారు. పాఠశాల కరెస్పాండెంట్ దామెర్ల సిద్దయ్య మాట్లాడుతూ కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ అనేది చిన్న పిల్లలకు ఒక మైలురాయని పేర్కొన్నారు. భవిష్యత్ విద్య ప్రణాళికలకి చిన్నారులకి ఈ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. పాఠశాలలో చదివి ఇటీవల గ్రూప్ 1,2,3, అలాగే మునిసిపల్‌శాఖలో ఏఈఈగా ఎంపికైన పలువురు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రమ, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ్, హెడ్ కానిస్టేబుల్ దేవేందర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.





సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మున్సిపాలిటి 15వ వార్డ్ అంకతివాడ (టీచర్స్‌కాలనీ)లో నెలకొన్న డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు కాలనీవాసులు ఆదివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేక 14 ఏండ్లుగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. డ్రైనేజీ లేకపోవడంతో దోమల వృద్ధిచెంది చెంది డెంగ్యూ వంటి వ్యాధులు సోకి అవస్థలు పడుతున్నామని వాపోయారు. రోడ్లు, మంచినీటి సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నామని సమస్యలను పరిష్కరించాలని ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సమస్యలను తీర్చాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు బండ శ్రీనివాస్, పింగిలి వేణుగోపాల్, కాంద్రపు శ్రీనివాస్, ఇండ్ల మల్లేష్, నస్పూరి తిరుపతి, పనస లచ్చన్న, సత్యం, నాగరాజు పాల్గొన్నారు..

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడి ఎన్నిక



నవతెలంగాణ-లక్షెట్టిపేట

బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడిగా లక్షెట్టిపేట పట్టణానికి చెందిన మోత్కూరి నారాయణగౌడ్‌ను సెంట్రల్ కమిటీ కోఆర్డినేటర్ నసాని రాంచందర్, జోనల్ ఇన్‌చార్జి కాదసి రవీందర్‌ల సమక్షంలో బీఎస్పీ కండువా కప్పి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక చార్వాక మీటింగ్ హల్‌లో నిర్వహించిన సమావేశంలో జాతీయ కమిటీ కోఆర్డినేటర్ రాంజీ గౌతమ్ ఆదేశాలతో ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా సెంట్రల్ కోఆర్డినేటర్ నాసాని రాంచందర్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బహుజన సమాజం కోసం పాటు పడే ఏకైక పార్టీ బీఎస్పీ మాత్రమే అన్నారు. బహుజనుల రాజ్యాధికారమే ధ్యేయమని అన్నారు. అనంతరం నారాయణ గౌడ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో కట్టబెట్టిన పదవికి తగిన న్యాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజు, ఎలక్షన్ కమిటీ మెంబర్ సిరాజోద్దీన్, నాయకులు ముల్కల రాజేంద్ర ప్రసాద్, దాగం శ్రీనివాస్, జగన్, కిషన్‌రావు, కృష్ణ చైతన్య తుకారాం, హుస్సేన్, సుందిళ్ల అశోక్, చెన్నూరి రాజు, తిప్పరపు రమేష్, విజేందర్, మహేష్, రాజ్‌బాబు పాల్గొన్నారు.

రేపు సంతల వేలంపాట

నవతెలంగాణ-ఉట్నూర్

2025-26 వ సంవత్సరానికి ఉట్నూర్ మేజర్ గ్రామపంచాయతీ దిన, వారసంత వేలం పాట మంగళవారం నిర్వహిస్తున్నట్లు జీపీ ఈఓ శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనేందుకు గిరిజనులు మాత్రమే అర్హులని, ఆసక్తి వారు ఉదయం 11 గంటల వరకు వేలానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

వేదాంత్ లెర్నింగ్ కోచింగ్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని విద్యానగర్‌లో వేదాంత్ లెర్నింగ్ కోచింగ్ సెంటర్‌ను ఆదివారం ప్రారంభించారు. దీనికి రాష్ట్ర హెడ్ ప్రవీణ్ కుమార్ ముఖ్య అథితులుగా హాజరయ్యారు. సెంటర్‌ను ప్రారంభించి అందించే కోచింగ్ వివరాలను తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లాలో తొలిసారిగా జేఈఈ మెయిన్స్ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఉన్నత చదువుల్లో రాణించే విద్యార్థులకు ఇది మంచి అవకాశమని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వేదాంత్ సెంటర్ ఆదిలాబాద్ బ్రాంచ్ హెడ్ విజయ్, కౌన్సిలర్ అకిలేష్, సొసైటి సభ్యురాలు సంధ్యరెడ్డి, సిబ్బంది పార్థసారథి, సందీప్ ఉన్నారు.



దీక్ష శిబిరం వద్ద భగత్ సింగ్ వర్ధంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణ కోసం సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆదివారం సీపీఐ(ఎం) పార్టీ కార్యకర్తలు సందర్శించి మద్దతు తెలిపారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుడు షాహిద్ భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాధన కమిటీ నాయకులు, రైతు సంఘం నాయకులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు ఉన్నారు.



సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు



నవతెలంగాణ-సిరికొండ

గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని రిమ్మ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి, 153 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వంలో పేదల సంక్షేమం కోసం పెద్దపీట వేస్తున్నామని అన్నారు. ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి, పేదోడి సొంతింటి కళలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందని తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలని అన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ సంతోష్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇమామ్, నాయకులు పెందూర్ అనిల్ కుమార్, అమృత్‌రావ్, రఘురాం, ప్రవీణ్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఐదో రోజు సీసీఐ దీక్షలో రైతు సంఘం నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు ఆదివారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నాయి. కాగా ఈ దీక్ష శిబిరంలో ఆదివారం అఖిలపక్ష రైతు సంఘం నాయకులు పాల్గొని, మద్దతు తెలిపారు. ఈ దీక్షలను సాధన కమిటీ కోకన్వీనర్లు విజ్జగిరి నారాయణ, బొల్లు ఈశ్వర్‌దాస్ పూలమాలలు వేసి ప్రారంభించారు. కాగా సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్ నాయకత్వంలో లంక జమున, సునీత, మంజుల, పోచ్చక్క 50 మంది సీపీఐ(ఎం) పార్టీ కార్యకర్తలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సీసీఐని ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బడ్జెట్‌లో సీసీఐకి నిధులు కేటాయించి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. యువతకు ఉపాధి కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో బండి దత్తాత్రి, కొండ రమేష్, నల్ల గణపతిరెడ్డి, లోకారి పోశెట్టి, చిలుక దేవిదాస్, యాసం నర్సింగరావు, కొడప సురేష్, రాజ్ సిద్దార్థ్, దాసరి రమేష్, బొల్లు ఈశ్వర్‌దాస్, బమాన్ జగన్, ఖలీమ్, కార్తీక్, శివ, ఖలీల్, నదీమ్, సిడం గంగు, మెస్రం భీమ్ రావు, రమేష్ జాదవ్ ఉన్నారు.

శిక్షణలను సద్వినియోగం చేసుకుంటూ రాణించాలి

- సాయివైకుంట ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండాలనే లక్ష్యంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో అందిస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు రాణించాలని సాయివైకుంట ట్రస్ట్ చైర్మెన్, ప్రముఖ హోమియోపతి వైద్యుడు డాక్టర్ రవి కిరణ్ యాదవ్ అన్నారు. ఆదివారం ట్రస్ట్ భవనంలో మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికేట్లను అందించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మహిళలు, యువతులకు ఆయా విభాగాల్లో శిక్షణ ఇచ్చిన శిక్షకులను శాలువతో సత్కరించి అభినందించారు. అనంతరం డాక్టర్ రవికిరణ్‌యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న ధరల నేపథ్యంలో మహిళలు కుటుంబానికి చేయూతనివ్వాలనే ఉద్దేశ్యంతో ట్రస్టు తరపున కుట్టుమిషన్, అల్లికలతో పాటు ఎంబ్రాయిడరీ, ఉన్ని వస్తువుల తయారీపై శిక్షణాలు అందిస్తున్నామన్నారు. సర్టిఫికెట్లు తీసుకున్నాం ఇక అయిపోయిందని అనుకోకుండా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలన్నారు. సంపాధిస్తూ పిల్లలతో పాటు తమ భవిష్యత్తును మెరుగ్గా తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రొఫెసర్ సల్ల విజయ్ బాబు, శ్రీనివాస్, మహేందర్, టీచర్స్ అందుగుల శ్రావణి, ఓరుగంటి వీణ, హరిందర్, ప్రవళిక, పూజిత, మీన, ఉన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభం నేలకొరిగింది. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఈ ప్రమాదం మధ్యాహ్నం సంభవిస్తే భారీప్రమాదం జరిగేదని రాత్రి సమయంలో ఎవరు లేకపోవడం వల్ల నష్టం జరగలేదని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్‌స్తంభం కూలిపోయి వైర్‌లు తెగిపోవడంతో కరెంట్ కనెక్షన్ లేక.. సాగుకు నీరందించేందుకు ఇబ్బందిగా మారిందని, విద్యుత్‌శాఖ అధికారులు సకాలంలో స్పందించి మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాల్లేవ్..

- రెండు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు
- పట్టించుకోని ప్రభుత్వం



నవతెలంగాణ-సిరికొండ

గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు రాక అష్ట కష్టాలు పడుతున్నారు. రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కోసం కూలి పనులు చేసుకుంటున్నారు. అలాగే కొందరు అప్పులు చేసి బతుకు బండి నడుపుతున్నారు. సిరికొండ మండలంలో 19 గ్రామపంచాయతీల్లో మంది కార్మికులు (మల్టీ పర్పస్ వర్కర్లు) పనిచేస్తున్నారు. పాలకవర్గాలు ఉన్న సమయంలో కేంద్రం, రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధులతో పాటు ఇంటి పన్నుల నుంచి వచ్చే నిధులతో క్రమం తప్పకుండా కార్మికులకు ప్రతి నెల రూ.9500 చొప్పున వేతనాలు చెల్లించేవారు. గ్రామపంచాయతీ పాలకవర్గాలు లేక 13 నెలలుగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. పాలకులు లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. అలాగే రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి సైతం నిధులు రావడం లేదు. దీంతో కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి గ్రామపంచాయతీలో నిధుల కొరత ఏర్పడింది. అధికారులు కార్మికులు వేతనాలకు ఇవ్వడానికి బిల్లులు చేసి ప్రభుత్వానికి పంపుతున్నారు. కానీ ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో బిల్లులు ట్రెజరీ వద్ద పెండింగ్‌లో ఉంటున్నాయి. గతంలో సర్పంచులు కార్మికులకు ఏదో విధంగా వేతనాలు సర్దుబాటు చేసేవారు. ప్రస్తుతం పాలకులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇబ్బందులు పడుతున్నాం



నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నాం. సర్పంచులు ఉన్నప్పుడు ప్రతి నెల వేతనాలు వచ్చేవి. గ్రామాల్లో మేము చేస్తున్న శ్రమను గుర్తించి, ప్రభుత్వం క్రమం తప్పకుండా వేతనాలు ఇచ్చి కార్మికులను ఆదుకోవాలి.

తోకల ఎల్లుబాయి, సిరికొండ, మల్టీపర్పస్ వర్కర్

నెలనెలా వేతనాలు అందేలా చూడాలి



నెలనెలా వేతనాలు అందేలా చూడాలి. రెండు, మూడు నెలలకొకసారి వేతనాలు ఇస్తే అవసరాలకు డబ్బులు అందక అప్పుల పాలు అవుతున్నాం. వేతనం అందక పోయిన పని చేస్తున్నాం. ప్రభుత్వం తొందరగా స్పందించి తమ వేతనాలు ఇవ్వాలి.

జలపతి సుంకిడి, గ్రామపంచాయతీ కారోబారి

వారం రోజుల్లో జమ అవుతాయి

గత నవంబర్ నెల వరకు పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలను అందజేశాం. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరికి సంబంధించిన వేతనాల గురించి ప్రభుత్వానికి నివేదిక పంపించాము. వారం రోజుల్లో పంచాయతీ కార్మికులకు వేతనాలు వారి ఖాతాల్లో జమ అవుతాయి.



ఎంపీఓ సంతోష్

కళాకారులు తమని తాము నిరూపించుకోవాలి

- ప్రముఖ నిర్మాత డాక్టర్ రవి కిరణ్ యాదవ్
- ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో అవార్డుల ప్రధానోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కళాకారులకు మంచి అవకాశాలున్నాయని వాటిని సద్వినియోగం చేసుకొని తమని తాము నిరూపించుకోవాలని ప్రముఖ నిర్మాత డాక్టర్ రవి కిరణ్ యాదవ్ అన్నారు. ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ ఫిల్మ్ సొసైటి ఆధ్వర్యంలో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఇందులో సీనియర్ జర్నలిస్టులకు మీడియా ఎక్సలెన్సీ అవార్డు, షార్టు ఫిలీం తీసిన వారికి ప్రశంస పత్రాలు అందించి శాలువతో సత్కరించారు. మీడియా ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024" అనే ప్రత్యేక విభాగంలో, జిల్లాకు చెందిన ప్రముఖ పత్రికా రచయితలు, కాలమిస్టులు, విలేఖర్లు హర్ పాల్ సింగ్, పిల్లమరి శ్రీనివాస్, సుమనస్పతి, మురళిధర్, అహుజా, రమకాంత్, క్రిష్ణకాంత్‌గౌడ్, మనికేశ్వర్, నూకల దేవేందర్, లేనిన్, వినోద్ కుమార్, అహ్మద్ అథర్, దత్తు ఆసిలా సిరికొండ అవార్డులు అందుకున్నారు.

కళాకారులకు కొదవ లేదు...

ఈ సందర్భంగా సిని నిర్మాత డాక్టర్ రవి కిరణ్ యాదవ్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్‌లో షూటింగ్‌కు అనేక అవకాశాలున్నాయన్నారు. కళాకారులకు కొదవలేదని సీని రంగంలో రాణించాలన్నారు. జిల్లా తాజాగా ఒక గొప్ప సాంస్కృతిక పరిణామానికి వేదికగా నిలిచిందన్నారు. జిల్లాలోని యువతలో కళా ప్రేరణను పెంపొందించటం, స్థానిక ప్రతిభను గుర్తించి గౌరవించటం, ఇది జిల్లాలో మొదటి సారిగా జరిగిన ఒక వినూత్న సాంస్కృతిక ప్రస్థానమన్నారు. చిన్న పట్టణాలలో ఎంతో గొప్ప ప్రతిభ ఉందని, సరైన వేదిక లభిస్తే వారు దేశ స్థాయికి ఎదగగలరని స్పష్టం చేశారు. తాను తీయబోయే సినిమాలకు ఇక్కడి వారికి ప్రాధాన్యతనిస్తానన్నారు. స్థానిక వనరులను వినియోగించుకుంటూసినిమాలు తీయాలన్నారు. ప్రతిభ కలిగిన కళాకారులకు గుర్తింపు, అవకాశాలు లభిస్తాయన్నారు. గతం కంటే ప్రస్తుతం చాలా మార్పు వచ్చిందని తెలిపిన ఆయన వాటిని వినియోగిస్తూ మరింతగా రాణించాలన్నారు. కార్యక్రమంలో సినిమ దర్శకుడు చిలుకూరి ఆకాష్ రెడ్డి, సొసైటి అధ్యక్షుడు రమేష్ గౌడ్, పలువురు కళాకారులు, సాయిచరణ్, షార్ట్ ఫిల్మ్ మేకర్స్, పాత్రికేయులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేశామని ప్రకటించడం సరికాదు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో పూర్తిస్థాయిలో రెండు లక్షల రుణమాఫీ చేశామని బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించడం సరికాదని, 50 శాతం రైతులకు కూడా రుణమాఫీ కాలేదని అఖిల పక్ష రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండిదత్తాత్రి అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి ప్రకటనను తప్పు బడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. రైతు రుణమాఫీ 50 శాతం మందికే చేసి అందరికి చేశామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం హామీలను విస్మరిస్తున్న కారణంగా రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఆత్మహత్యలను నివరించాలంటే ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు ఉన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

భగత్‌సింగ్ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రఖ్యాత ఉద్యమకారుడు అని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ అన్నారు. ఆదివారం యూనియన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర సమరయోధుడు లాలా లజపతిరాయ్ హత్య నేపథ్యంలో ఒక పోలీసు అధికారిణి చంపడంతో భగత్‌సింగ్‌కు ఉరిశిక్ష విధించారన్నారు. ఉరికోయను ముద్దాడుతూ 23 మార్చి 1931న తుదిశ్వాస విడిచారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలు, ఆలోచనల స్ఫూర్తిగా విద్యార్థి, యువత ముందుకు సాగాలన్నారు. ఇందులో నాయకులు మెస్రం పవన్, బండారి సాయి కుమార్, మెస్రం సచిన్, ప్రవీణ్, సత్యనారాయణ, అశోక్, భరణి, రవి, పాల్గొన్నారు

వెంటాడుతున్న తాగునీటి సమస్య..

- మిషన్ భగీరథ నీరు అందడం లేదని గ్రామస్తుల ఆగ్రహం
- ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోని అధికారులు..
- నీటి కోసం బారులు తీరిన మహిళలు

నవతెలంగాణ-కుభీర్

పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతంలోని ప్రతి మారుమూల గ్రామాలకు ఇంటింటికి తాగునీరు అందించాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్షలు నిధులు ఖర్చు చేసి మిషన్ భగీరథ పథకం ప్రవేశపెట్టి ప్రతి ఒక్క ఇంటికి తాగునీటిని అందిస్తామని చెప్పి ఒక్క ఇంటికి కూడా చుక్క నీళ్ల అందకుండా పోయింది. దీంతో పథకం ప్రారంభం నుంచే పైపులైన్ పనులు నాసిరకంగా చెపట్టడంతో గ్రామాల్లో సరిగ్గా నీళ్ల అందడం లేదని మహిళలు అగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పార్డి(బి) గ్రామంలో రోజు రోజుకు పెరుగుతున్న ఎండలతో తాగునీటి సమస్య తీవ్రంగా వెంటాడుతుంది. అదే విధంగా గ్రామంలో లక్షలతో నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌లో నీళ్ల లేక అవి అలంకార ప్రయంగా మారాయి. గ్రామంలో బోర్ నుంచి నీళ్ల మినీ వాటర్ ట్యాంక్‌లకు సరఫరా కావడం లేదు. దీంతో నీటి కోసం రాత్రి నిద్ర లేకుండా గంటల తరబడి మహిళలు, ప్రజలు బారులు తీరారు. నీటి సమస్య ఉందని గ్రామంలో పలు మార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోకుండా పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఉన్నత స్థాయి అధికారులైన గ్రామంలో నీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గ్రామంలో నీటి సమస్య రాకుండా చూస్తాం



ఎండాకాలంలో గ్రామంలో నీటి సమస్యలు రాకుండా ప్రత్యేక ప్రణాళికలు చేపట్టి గ్రామంలో సమస్య రాకుండా చూస్తాం. అవసరమైన గ్రామమలో ట్యాంకుల ద్వారా సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం

మోహన్ సింగ్, ఎంపీఓ

నీళ్లు లేక చాలా ఇబ్బందిగా ఉంది

గత పది రోజుల నుంచి మాగల్లీలో ఉన్న మినీ ట్యాంక్‌కు సరఫరా అయ్యో నీళ్ల రాకపోవడంతో తమ చుట్టూ ప్రక్కలా ఉన్న ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉంది. దీంతో తాగడానికి వంట చేసుకోవడానికి గ్రామానికి సమీపంలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో ఉన్న బోర్ నుంచి తెచ్చుకునే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడుతుంది. అధికారులు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు.



పర్వతి బాయి పార్డి(బి)

భగత్ సింగ్‌కు సీపీఐ(ఎం) ఘన నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్

బ్రిటిష్ పాలకుల దురాగ తాలను వ్యతిరేకిస్తూ స్వయం పాలన సాధించాలని తిరుగుబాటు జెండాను ఎగరవేసి స్వాతంత్ర పోరా టంలో యువకులను భాగ స్వామ్యం చేసిన వ్యక్తి భగత్ సింగ్ అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. లౌకిక వాదాన్ని చాటారని అన్నారు. భగత్ సింగ్ రాజ్, రాజ్ గురు, సుక్‌దేవ్ 94వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వీరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ.. తన 23వ ఏటనే భగత్‌సింగ్‌కు ఉరిశిక్ష వేసినప్పటికీ ఏ మాత్రం వెనకడుగు వేయకుండా సోషలిస్టు వ్యవస్థ ద్వారానే కుల మత వర్ణ వ్యవస్థ లేని దోపిడి రహిత సమాజం ఏర్పడుతుందని నినదించిన వ్యక్తి భగత్ సింగ్ అని తెలిపారు. భగత్ సింగ్ ఉరిశిక్షను రద్దు చేయాలని తన తండ్రి క్షమాభిక్ష కోసం అప్పీల్ చేస్తే దాన్ని నివారించి ఈ నిరంకుశ ప్రభుత్వాన్ని ఎదిరించటానికి ఉరిశిక్ష కైనా సిద్ధమే అని చెప్పినట్టు తెలిపారు. అందువల్లనే ఆయన స్ఫూర్తి నేటికి భారత ప్రజలకు ప్రధానంగా యువ లోకానికి స్ఫూర్తిదాయకంగా మారిందని ఆయన చిరస్మరణీయంగా మన గలిగారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, సురేష్, విగ్నేష్ నాయకులు దీపిక, ఉద్ధవ్, శ్రీనివాస్, అబ్దుల్, రాజు,సుచిత్ పాల్గొన్నారు.

17 గంజాయి మొక్కలు స్వాధీనం



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కొరటికల్ గ్రామ శివారులో గంజాయి సాగు చేస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు తనిఖీ నిర్వహించి17 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం మండలంలోని కొర్టికట్ శివారులోని ఫారెస్ట్ కంపోర్ట్‌మెంట్ నం.48లోని భూమిలో పడ్వాల్ దశరథ్, సాగర్‌బాయ్ కూరగాయలతో పాటు అంతర పంటగా గంజాయి పంట సాగు చేస్తున్నారు. పట్టుకున్న గంజాయి మొక్కల విలువ రూ. లక్షా 70 వేలు ఉంటుందని, పడ్వాల్ దశరథ్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. తొందరలోనే పట్టుకుంటామన్నారు. ఈ తనిఖీలో ఇచ్చోడ సీఐ భీమేష్ ఉన్నారు.